ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -85 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం 14 జులై 2026




# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత



**పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు**

**ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు**

**డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది**

**పవన్ ను అవమానిస్తున్నారు...**

**వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు**

**ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117**

**కొత్తపేట,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు **మిగతా 2లో..**



## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

**హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్**

**ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ**

**ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి**

**జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్**



**న్యూఢిల్లీ,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం **మిగతా 2లో..**

## నరహంతకుడు మృతి

**పురుగుల మందు తాగి ఆత్మహత్య -సూసైడ్ కు ముందు సెల్ఫీ వీడియో**

**కొత్తూరు మండలంలో ఘటన**

**వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి**



**కొత్తూరుజూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అతి కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన హంతక ఉన్మాది రాజ్ కుమార్ కథ విషాదంగా ముగిసింది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. కొత్తూరు మండలంలోని పెన్జర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్ సమీపంలోని **మిగతా 2లో..**



## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

**తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ**

**పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. **మిగతా 2లో..**

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

**ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స**

**మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు**



**ముంబై జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):-**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను **మిగతా 2లో..**

## జాడలేని వర్షాలు

**ముఖం చాటేసిన మబ్బులు**

**మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**



**హైదరాబాద్,జూలై13(ఆర్ఎన్ఎ):**
తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు **మిగతా 2లో..**

## రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంగా 175 ఎంబీబీఎస్ సీట్లు

**పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 సీట్లతో అనుమతి**

**విజయవాడ ప్రభుత్వ సిద్దార్థకు అదనంగా 75 సీట్లు**

**ఈ విద్యా సంవత్సరంలోనే 4 ప్రభుత్వ కళాశాలల్లో అదనంగా 325 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనంగా 505 సీట్లు**

**ప్రైవేట్‌లో వైద్య కళాశాలల్లో 550 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అదనంగా 1055 సీట్లు**

**నీట్ మెరిట్ విద్యార్థులకు భారీ ఊరట**

**ఆనందం వ్యక్తం చేసిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్**



**2లో.**

## కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం




**పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి**

**మెట్రో, ట్రిపుల్ ఆర్ తదతిర అంశాలపై అనుమతులు రాబట్టాలి**

**ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ**

**ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు**

**సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు**

**హైదరాబాద్,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ **మిగతా 2లో..**

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత



.మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాంఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు.

2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిదిగోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. విచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యంరాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది.రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

## జాడలేని వర్షాలు

మొదటిపేజీ తరువాయి

3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

మొదటిపేజీ తరువాయి

ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

మొదటిపేజీ తరువాయి

ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది.ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## నరహంతకుడు మృతి

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయ పొలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించేందుకు మృతిని సోదరుడు, పెంజర్ల గ్రామంలో నివాసముండే మేనమామలను పిలిపించారు. వారు రాజ్ కుమార్ (29) మృతదేహాన్ని గుర్తించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉంది. ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడు రాజ్‌కుమార్.. షాబాద్‌లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. దాంతో మే నెలలో ఇతనిపై బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు పెట్టారన్న కోపం పెంచుకున్న నిందితుడు.. శుక్రవారంఅర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి.. ఆమె తల్లి, అమ్మమ్మను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బాలికను తీసుకొని దైవాలగూడానికి చేరుకొని, అతని సొంత ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులను కుడా కత్తితో పొడిచి చంపాడు. తిరిగి అక్కడ నుండి బాలికను తీసుకొని సుమారు 200 మీటర్ల దూరంలో బాలికను కూడా హత్య చేసి పరారయ్యాడు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి.. 'నేను ఆరుగురిని హత్య చేశాను.. నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పాడు. అయితే ఆరుగురి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కొత్తూరు మండలం పెంచర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆ మృతదేహం రాజ్ కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితునికి ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా అలవాటు ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి సుమారు రూ.2కోట్లు అప్పు చేశాడు. దాంతోపాటు అతడు 16 సిమ్ కార్డులను తీసుకొని నెంబర్లు మారుస్తూ వాడుతున్నాడు.

**వాడిని అంత ప్రశాంతంగా చనిపోనియాల్సింది కాదు..: (మృతుని సోదరుడు భాస్కర్**

అభం శుభం తెలియని పసిపిల్లలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలు తీసిన రాజ్‌కుమార్ అంత ప్రశాంతంగా చనిపోవాల్సింది కాదని, వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సిందని మృతుని సోదరుడు భాస్కర్ అన్నారు. వాడి వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఏడుస్తూ పోలీసుల ముందు మొరపెట్టుకున్నాడు.

## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు.

ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళ్లు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు.ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు.ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు.పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

# రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంగా 175 ఎంబీబీఎస్ సీట్లు

**పిడుగురాళ్ల వైద్య కళాశాలకు 100 సీట్లతో అనుమతి**

**విజయవాడ ప్రభుత్వ సిద్దార్థకు అదనంగా 75 సీట్లు**

**ఈ విద్యా సంవత్సరంలోనే 4 ప్రభుత్వ కళాశాలల్లో అదనంగా 325 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనంగా 505 సీట్లు**

**ప్రైవేట్‌లో వైద్య కళాశాలల్లో 550 సీట్లు**

**కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అదనంగా 1055 సీట్లు**

**నీట్ మెరిట్ విద్యార్థులకు భారీ ఊరట**

**ఆనందం వ్యక్తం చేసిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్**



**అమరావతి,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):-**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణలో మరో కీలక ముందడుగు పడింది. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) రాష్ట్రంలోని రెండు ప్రభుత్వ వైద్య కళాశాల(పిడుగురాళ్ల, విజయవాడ)ల్లో 175 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఆమోదం తెలిపింది. వీటితో కలిపి ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా లభించిన సీట్ల సంఖ్య 325కు చేరింది. పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో 100 సీట్లతో ప్రవేశాలు జరిపేందుకు ఎన్ఎంసి అనుమతినిచ్చింది. అదే విధంగా విజయవాడ ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాలకు అదనంగా 75 సీట్లను ఎన్ఎంసి మంజూరు చేసింది. ఈ మేరకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసి) లెటర్ ఆఫ్ పర్మిషన్లను సోమవారం జారీ చేసింది. ఇప్పటికే కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు 75, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు 25 సీట్ల పెంపునకు ఎన్ఎంసి ఆమోదం తెలిపింది. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 అదనపు ప్రవేశాలు జరుగనున్నాయి. దీంతో ఈ ఒక్క విద్యా సంవత్సరంలోనే రాష్ట్రానికి ప్రభుత్వ వైద్య కళాశాల ల ద్వారా 325 అదనపు ఎంబీబీఎస్ సీట్లు లభించినట్లైంది. 2024-25 నుండి ఇప్పటి వరకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 505 సీట్లు అదనంగా లభించాయి. ఎంబీబీయస్ సీట్లు భారీగా పెరగడంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న నీట్ మెరిట్ విద్యార్థులకు ఊరటనిస్తోంది. మంత్రి శ్రీ సత్యకుమార్ నిరంతర కృషి ఈ ఫలితాల వెనుక రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చేసిన నిరంతర కృషి కీలకంగా నిలిచింది. ఎన్ఎంసి అనుమతులు పెండింగ్‌లో ఉన్న ప్రతి కళాశాల పురోగతిని స్వయంగా సమీక్షిస్తూ, ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య శాఖ, ఎన్ఎంసి ఉన్నతాధికారులతో పలుమార్లు సంప్రదించి రాష్ట్ర ప్రతిపాదనలకు ఆమోదం వచ్చేలా మంత్రి సమన్వయం చేశారు. అధికారులు గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసేలా ప్రత్యేక దృష్టి సారించడంతో వరుసగా ఫలితాలు వస్తున్నాయి. అత్యంత కీలకమైన పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల విషయంలో సాంకేతిక అంశాలు అడ్డంకిగా మారిన సమయంలో మంత్రి స్వయంగా వ్యవహారాన్ని పర్యవేక్షించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, పరికరాల కల్పనను వేగవంతం చేయడంతో ఎన్ఎంసి 100 ఎంబీబీఎస్ సీట్లతో అనుమతి మంజూరు చేసింది. దీంతో ఈ విద్యా సంవత్సరంలోనే అక్కడ తొలి బ్యాచ్ విద్యార్థులు అడుగుపెట్టనున్నారు.కూటమి ప్రభుత్వ హయంలో రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అదనంగా భారీ స్థాయిలో 505 ఎంబిబియస్ ప్రవేశాలకు అవకాశం లభించడంపై మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీని వలన పేద విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

# విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా మరో అవకాశం

### 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా విద్యాశాఖ అధికారి లండ సుధాకర్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 13)**
ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 10వ తరగతి (ఎస్ఎస్సీ) మరియు ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) లండ సుధాకర్ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యను మధ్యలో నిలిపివేసిన వారు, ఉద్యోగులు, గృహిణులు మరియు ఇతర ఆసక్తి గల అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యాభ్యాసాన్ని కొనసాగించుకునే అవకాశం కల్పించబడుతోందన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరడం ద్వారా తమ విద్యార్హతలను మెరుగుపరుచుకుని భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.
అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోగా సమీప ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ అధ్యయన కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఏసిజిఇ హెచ్. గోవింద నాయక్, డిప్యూటీ డీఈవో శ్రీధర్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం. అసదుల్లా ఖాన్, కే. నాగభూషణం, జిల్లా ఉర్దూ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్. ఆదం భాష, బిసిఈబిసెక్రటరీ నాగరాజు, ఏఎస్ఓ పి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన

### గుత్తి మోడల్ స్కూల్‌లో సీఐ రామారావు సూచనలు

**అనంతపురం/గుత్తి, జూలై 13: (రిపబ్లిక్ న్యూస్)**
విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గుత్తి సీఐ రామారావు సూచించారు. గుత్తి పట్టణంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం పోలీసు సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కూడా దెబ్బతీస్తుందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే మహిళలపై జరిగే నేరాలు, పిల్లల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, సైబర్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రతా నిబంధనలు, స్త్రీరక్ష యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు, మత్తు పదార్థాల విక్రయాలు లేదా సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా అప్రమత్తం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదులపై వేగవంతమైన చర్యలు

### 112 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ -చట్టబద్ధంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 13)**
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించి, చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలు కొత్తపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విని వినతిపత్రాలను స్వీకరించారు.
ఈ కార్యక్రమానికి మొత్తం 112 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందిన ఫిర్యాదుల్లో ఉద్యోగాల పేరుతో మోసాలు, అనుమానాస్పద మరణంపై విచారణ, ఫ్రాంచైజీ పేరుతో భారీ మోసం, నకిలీ ధ్రువపత్రాల సృష్టి, కుటుంబ ఆస్తి వివాదాలు, ఆర్థిక మోసాలకు సంబంధించిన అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఉద్యోగం ఇప్పిస్తానని రూ.34 వేల మోసం చేసిన ఘటన, ఫ్రాంచైజీ పేరుతో రూ.60 లక్షల మోసం, అలాగే ఉద్యోగాల పేరుతో మరో రూ.60 లక్షల మోసానికి సంబంధించిన ఫిర్యాదులు అధికారుల దృష్టికి వచ్చాయి. ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, ఇస్మాయిల్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాతలాన్ పోటీల్లో కర్నూలు క్రీడాకారుల సత్తా

### లేజర్ రన్ పోటీల్లో పలు విభాగాల్లో పతకాలు సాధించి జిల్లా ఖ్యాతి చాటిన క్రీడాకారులు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 13)**
నెల్లూరు జిల్లాలో ఈ నెల 10, 11 తేదీలలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాతలాన్ లేజర్ రన్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి పలు పతకాలను కైవసం చేసుకున్నట్లు జిల్లా మోడ్రన్ పెంటాతలాన్ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి తెలిపారు. పోటీల్లో అండర్-17 బాలుర టీమ్ ఈవెంట్ విభాగంలో కర్నూలు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. అండర్-15 వ్యక్తిగత విభాగంలో ఎస్. అఖిల్ ద్వితీయ స్థానం దక్కించుకోగా, సీనియర్ మహిళల విభాగంలో వెంకటేశ్వరి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే వెంకట భరత్ తన విభాగంలో తొలి స్థానంలో నిలిచారు. సీనియర్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో కర్నూలు జిల్లా జట్టు మొదటి స్థానం సాధించగా, జూనియర్ బాలుర వ్యక్తిగత విభాగంలో రహిమాన్ ద్వితీయ స్థానం పొందారు. విజేతలకు రాష్ట్ర మోడ్రన్ పెంటాతలాన్ అసోసియేషన్ చైర్మన్ సీహెచ్. వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కె. హరిబాబు, టెక్నికల్ డైరెక్టర్ కె. కృష్ణ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విజేతలను జిల్లా సంఘం ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాభిమానులు అభినందించారు.



# ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలి

**: కమిషనర్ చల్లా ఓబులేసు**

**250 కిలోలకు పైగా నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం**

**రూ.1.95 లక్షల జరిమానాలు విధింపు**

**ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ తప్పనిసరి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 13)**
పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు వ్యాపారులు, ప్రజలకు పిలుపునిచ్చారు. పాత బస్టాండ్ ప్రాంతంలోని దుకాణాలను సందర్శించిన ఆయన, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని స్వచ్ఛందంగా పూర్తిగా నిలిపివేయాలని కోరారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం నగరపాలక సంస్థ నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 201 దాడులు నిర్వహించి 250 కిలోలకు పైగా నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.1,95,150 జరిమానాలు విధించినట్లు వెల్లడించారు.
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్లాస్టిక్‌కు బదులుగా వస్త్ర సంచులు, కాగిత సంచులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతి వ్యాపార సంస్థ తమ దుకాణం ముందు తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను రోడ్లపై వేయకుండా అందులోనే వేయాలని ఆదేశించారు. నగర పరిశుభ్రతకు ప్రతి వ్యాపారి భాగస్వామి కావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు సుంకేసుల రోడ్డు, ఎన్.ఆర్.పేట ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.





# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన లాయర్ ప్రవీణ్ కుమార్

**చిప్పగిరి, జూలై, 13,( రిపబ్లిక్ న్యూస్)**
మాజీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని సోమవారం లాయర్ ప్రవీణ్ కుమార్ బెలుగొండ ఆంజనేయస్వామి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముంబయిలో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య ఆశీస్సులతో రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా ప్రజాసేవ కొనసాగించాలని కోరుకున్న ఆలూరు నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు మొలగవెల్లి లాయర్ ప్రవీణ్ కుమార్ కోరారు.



# జిల్లా బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో కనకవీడు గ్రామంలో అవగాహన కార్యక్రమం



**నందవరంజూలై, 13,( రిపబ్లిక్ న్యూస్)** :జిల్లా బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో ఈరోజు .13.07.2026 తేదీన నేల రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం నందవరం మండలము కనకవీడు గ్రామంలో హైస్కూల్ లో భేటీ బచావో భేటీ ఫాడహో మరియు ఆత్మహత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈసందర్భంగా సామాజిక కార్యకర్త యన్.నరసింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబడిన బేటి బచావో బేటి పడావో (బాలికను రక్షించండిబాలికను చదివించండి) ఈ పథకం యొక్క ప్రధానమైన ఉద్దేశము బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురావడం జరిగింధనన్నారు నేటి సమాజంలో ఆడపిల్లలంటే ఆర్థిక భారము, అనే మూఢనమ్మకాలు ఉన్నవారికి ఈ పథకం ఎంతగాను ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా సమస్యలకు ఆత్మహత్య పరిష్కారము కాదని జీవితములో ఎదురయ్యే సవాళ్లను ధైర్యరంగా ఎదుర్కోకుంటూ ముందుకు సాగాలన్నారు. విదార్థి దశలో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, చదువుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు, నిరాశ, ఆందోళన వంటి కారణాలు మానసిక సమస్యలకు దారి తీస్తాయన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, స్నేహితులు లేదా అధికారులకు తెలియ చేసి వారి సలహాలు,సూచనలు తీసుకోవాలన్నారు, మరియు తల్లిదండ్రులు మందలించారని స్నేహితుల అవమానించారని పరీక్షలో ఫెయిల్ అయ్యామని మొదలైన సమస్యల వల్ల మానసిక ఒత్తిడి లోనే ఆత్మహత్యలకు పాల్పడడం సమస్యకు పరిష్కారం కాదని తెలిపారు ప్రశాంతంగా ఆలోచిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని మానసిక నిర్భరం కలిగి జీవించాలా ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు నెగిటివ్గా ఆలోచన చేయకుండా పాజిటివ్గా ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం తెలుస్తుంది అన్నారు ముఖ్యంగా విద్యార్థులలో సెల్ఫ్ కాన్ఫరెన్స్ పెంపొందించాలంటే చదువుతోపాటు ఆటలు క్రీడలు యోగ, మెడిటేషన్ మొదలైనటువంటివి నిత్యజీవితంలో అలవాటు చేసుకోవడం వల్ల సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లెవెల్స్ డెవలప్ అవుతాయిన్నారు. .ముంక్యంగా కొంత మంది విద్యార్థులు పరిక్షల సమయములో పరిక్షల భయముతో మరియు పరీక్షలలో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్య లకు పల్బడడము జరుగుతుంది ఆది సమస్య కు పరీక్షపరిష్కారము కాదు. చదువును ఇష్టంతో చదువుతూ మరియు ఒక్క ప్లాన్ ప్రకారం లేదా ఒక్కగోలు పెట్టుకొని చదువుతే విజయము సాధించవచన్నారు. విదార్థులలో సమస్యలు మనసులో దాచుకుంటే అవి ఆందోళనకు దారి తీస్తాయన్నారు. మరియు బాలల హక్కులకు,బాలల రక్షణకు భంగము కలిగినప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమేన్ హెల్ప్ లైన్ 181, ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ 100,112 మొదలైన హెల్ప్ లైన్ నెంబర్లకు సమస్యలను తెలియ చేసి పరిష్కరించుకోవాలనీ వారికి అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులుమరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మురుగునీటి శుద్ధికి రూ.150 కోట్ల ప్రాజెక్టుకు శ్రీకారం

### అమృత్ 2.0 కింద 35 ఎంఎల్‌డీ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు భూమిపూజ చేసిన మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 13)**
కర్నూలు నగరం నుంచి వచ్చే మురికి నీటిని శుద్ధి చేయడానికి అమృత్ 2.0 పథకం కింద రూ.150 కోట్ల వ్యయంతో 35 ఎంఎల్డీ సామర్థ్యం గల ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్త భూమిపూజ నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం మేరకు మురికి నీరు నదుల్లో కలవకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గతంలో తుంగభద్ర నదిలో మురికి నీరు కలవడం వల్ల ప్రజలు, పుష్కర యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, వ్యవసాయం తదితర అవసరాలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా అమలు చేస్తోందని, సూపర్ సిక్స్ పథకాలతో పాటు రహదారుల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన వంటి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని మంత్రి వివరించారు.
పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ, డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు సాధించి కర్నూలు అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు మంత్రి టీజీ భరత్ నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కూడా నగరాభివృద్ధికి మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు చేస్తున్న కృషిని అభినందించారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో బిజెపి రాజకీయ కుట్ర!!

**వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం**

**మోడీ సాబ్ ఎస్సీ వర్గీకరణ వల్ల కేవలం రెండు శాతం ప్రజలకే మేలు**

**దళితులపై కుట్ర చేస్తే ఖబర్దార్.**

**మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్**



**నంద్యాల.ప్రతినిధి జులై 13. (ప్రజా రిపబ్లిక్ న్యూస్,)**
భారతదేశంలో ఎస్సీ వర్గీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం బిజెపి రాజకీయ కుట్ర చేస్తుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ రత్నాకర్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని సూరత్ గ్రాండ్ హోటల్ లో మాల మహానాడు జిల్లా స్థాయి నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ. ఎస్సీ వర్గీకరణను శాంపుల్ గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, వర్గీకరణ కు బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మన మోడీ సాబ్, నిజానికి ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో 1-2 కి బెనిఫిట్ జరుగుతోంది, ఇది కూడా అధికారిక లెక్క కాదు,ఈ వందలో యిద్దరికిచ్చే ఈ ఫలాలను, సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ గారు? అలాగే ఈ రెండు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తూ ఉన్నాను, మాల వర్గం పై కుట్ర చేస్తుంటే , ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం, ఘోరం అన్యాయం, చెంచా గిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలి, రిజర్వేషన్ల బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగుల రా మాల జాతిని తొక్కేస్తా ఉన్నారు ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రండి మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండి, తెలుగు రాష్ట్రాల్లో ఏ నాడు ఎదుర్కొనటువంటి గడ్డు పరిస్థితిని మాల సామాజిక వర్గం ఈరోజు ఎదుర్కొంటూ ఉంది, పూర్తిగా తెలుగు రాష్ట్రాల్లో మన కులం తన ఉనికిని కోల్పోఇంది , శాంతియుత పోరాటానికి సిద్ధం కండి మిత్రులారా

ఈ కార్యక్రమంలో కొప్పెరా చిన చెన్నయ్య , దాసరి చిన్న లింగామయ్య, శ్రీరాముల చంద్రశేఖర్, గుణ్ణంపాడు శ్రీకాంత్, లక్క కేశవ, శ్రీరాములు సురేష్ గుద్దిటగిరి, కడారి గిరీష్ కుమార్, బేగార్ చిన అంజి తదితరులు పాల్గొన్నారు

## నంద్యాల న్యాయభేరి విజయవంతం చేయండి

**బహుజన ఉద్యోగులకు ఆర్ఈఎఫ్ పిలుపు**



**అనంతపురం/గుత్తి, జూలై 13: రిపబ్లిక్ న్యూస్**
19న నంద్యాలలో నిర్వహించే గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యోగుల న్యాయభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్. నారాయణ నాయక్ పిలుపునిచ్చారు. గుత్తి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం న్యాయభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు వంటి అత్యున్నత న్యాయస్థానాల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఆ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
బీసీలకు చట్టసభల్లో 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బహుజన వర్గాలకు సామాజిక న్యాయం జరిగే వరకు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఉద్యోగులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో నంద్యాల న్యాయభేరికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆర్ఈఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీధర్ గౌడ్, హనుమన్న, మాదన్న, సంజీవయ్య, రామాంజనేయులు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, బీఎస్పీ నాయకులు రామాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



**అనంతపురం/గుత్తి, జూలై 13:( రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని కోరుతూ గుత్తి పట్టణంలో సోమవారం జనసేన పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముంబైలో పవన్ కల్యాణ్ కుడి భుజానికి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో, ఆయన త్వరితగతిన కోలుకోవాలని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పరమశివుడి అనుగ్రహంతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు చిన్న వెంకటేశు మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడి, రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసేలా దేవుడు ఆశీర్వదించాలని కోరారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పాటిల్ సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, పట్టణ ఉప కార్యదర్శి గోరంట్ల నాగయ్య, మండల ప్రధాన కార్యదర్శి మిద్దె ఓబులేష్, బాసినేపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ రంగా, ధనంజయ, రాయల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మారాకుల రమణ, చిరంజీవి ఫ్యాన్స్ సీనియర్ అభిమాని అశ్వ నాగప్ప, రామాంజనేయులు, మందుల షాపు సురేష్, మనోజ్, రమేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ 1.25 కోట్ల ఆదాయం



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 13 రిపబ్లిక్ న్యూస్** శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ 1,25,45,420లు ఆదాయంగా సమకూరినట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు సోమవారం కొండపై 54 రోజులకు గాను లెక్కింపు నిర్వహించగా నగదు తో పాటు 43.950 గ్రాముల బంగారం 550 గ్రాముల వెండి విదేశీ కరెన్సీ ని అమ్మవారికి భక్తులు కానుకలుగా వేశారన్నారు అదేవిధంగా అన్నదాన శిబిరం వద్ద గల హుండీ ద్వారా రూ 22,179లు రణభేరి గంగమ్మ ఆలయం వద్ద ఉన్న హుండీ ద్వారా రూ 96,241లు ఆదాయంగా సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ ఆలయ అధికార సిబ్బంది, అర్చకులు, సేవకులు ,పాల్గొన్నారు.

## సోమవారం పురస్కరించుకొని బుగ్గ సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**అనంతపురం/ గుంతకల్ జూలై 13 (రిపబ్లిక్ న్యూస్)**
అనంతపురం జిల్లా గుంతకల్ మండలం కసాపురం గ్రామ సమీపంలో వెలసిన బుగ్గ సంగమేశ్వర ఆలయం ప్రసిద్ధి చెందినది ఈ పుణ్యక్షేత్రం పూర్వం ఈ ప్రదేశంలో ఎందరో మునులు తపస్సు చేశారని, వారి కోరిక మేరకు పరమశివుడు ఇక్కడ వెలిశాడని స్థానిక పురాణాలు చెబుతున్నాయి.ఎల్లప్పుడూ భూగర్భం నుండి నీరు బుగ్గ రూపంలో ఉబికి రావడం ఈ క్షేత్ర ప్రత్యేకత. శివరాత్రి మరియు ఇతర పర్వదినాలలో భక్తులు అధిక సంఖ్యలో ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు. ఆలయంలో శివునికి మరియు పార్వతి దేవికి పాలాభిషేకం రుద్రాభిషేకం అలంకరణ వంటి ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు చేయడం జరిగింది. ఈ పూజలో భాగంగా ఆలయ అర్చకులు, గ్రామస్తులు, భక్తాదులు పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్ ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యం

**జూలై 14లోగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 13)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. వలస వెళ్లిన, డబుల్‌గా నమోదైన, మరణించిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.
కర్నూలు పట్టణంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల పరిధిలోని 76, 78, 79, 80 పోలింగ్ కేంద్రాలు, చిదంబరం వీధిలోని వివేకానంద బాల విద్యా మందిర్ హైస్కూల్‌లో ఉన్న 181, 182 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వారీగా జరుగుతున్న పరిశీలన, డేటా నమోదు, ఫారాల పరిశీలన, ఏఎస్‌డీ జాబితాల తయారీ, అన్‌కలెక్టబుల్ ఓట్ల వివరాలను సమగ్రంగా పరిశీలించారు.
కొన్ని ప్రాంతాల్లో అన్‌కలెక్టబుల్ ఓట్ల శాతం అధికంగా ఉండటంపై అధికారులను ప్రశ్నించిన కలెక్టర్, గాయత్రి అపార్ట్‌మెంట్స్, గాయత్రి టవర్స్ ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి సర్వే వివరాలను పరిశీలించారు. వలస వెళ్లిన ఓటర్లకు ఫారం-6 అందజేశారా లేదా అన్న అంశాన్ని నిర్ధారించాలని, ప్రతి వివరాన్ని ఆధారాలతో నమోదు చేయాలని ఆదేశించారు.
ఏఎస్‌డీ జాబితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్న కలెక్టర్, ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన జాబితాలను డౌన్‌లోడ్ చేసి బీఎల్‌ఏల సంతకాలతో ధృవీకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.
ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి అంశాన్ని నమోదు చేయాలని, జూలై 14లోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా, అనర్హుల పేర్లు చేరకుండా ప్రతి వివరాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. సమయపాలనతో పాటు నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌ఓలు గత నెల రోజులుగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఏఈఆర్‌ఓలు, అదనపు ఏఈఆర్‌ఓల పర్యవేక్షణలో ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తుది ఓటరు జాబితాను జూలై 21న ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రచురించనున్నట్లు వెల్లడించారు.
కర్నూలు జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 20.86 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 96 శాతానికి పైగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తైందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నమోదు 95 శాతానికి చేరుకోగా, పట్టణ ప్రాంతాల్లో వలసలు అధికంగా ఉండటంతో 70 నుంచి 75 శాతం మేర మాత్రమే పూర్తైందన్నారు.
వలస వెళ్లిన ఓటర్లను ఫోన్, వాట్సాప్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరిస్తున్నామని, మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు మంచి స్పందన లభించిందన్నారు.
అబ్సెంట్, షిఫ్టెడ్, మరణించిన ఓటర్ల వివరాలను కేవలం బీఎల్‌ఓల నివేదికల ఆధారంగా కాకుండా, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే బుక్ ఏ కాల్స్ ద్వారా వచ్చిన 9 వేలకుపైగా ఫిర్యాదులు, సందేహాలను ఓటర్లకు తిరిగి ఫోన్ చేసి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.

## జలధార-జలహారతి పనులు వేగవంతం చేయాలి

**జిల్లాలకు రూ.2 కోట్ల నిధుల విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశాలు**

**రాష్ట్రవ్యాప్తంగా జలధార కార్యక్రమ పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**నంద్యాల జిల్లాలో చేపట్టిన పనుల వివరాలను వివరించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**






**నంద్యాల బ్యూరో, జూలై 13( రిపబ్లిక్ న్యూస్):**
జలధార-జలహారతి కార్యక్రమం అమలు పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల వృద్ధి, సాగునీటి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా మాట్లాడుతూ, జిల్లాలో జలధార - జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ చానళ్ల అభివృద్ధి, భూగర్భ జలాల వృద్ధికి చేపట్టిన పనుల పురోగతిని రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. జూన్ నెల నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన వర్షపాతం సాధారణ వర్షపాతంతో పోలిస్తే తక్కువగా ఉన్నప్పటికీ, వర్షపు నీటిని గరిష్టంగా ఒడిసిపట్టేలా చేపట్టిన జలధార - జలహారతి పనులు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన జలధార పనుల్లో ఇప్పటికే 97 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, చెరువుల సామర్థ్యాన్ని పెంపొందించడం, భూగర్భ జలాలను పునరుజ్జీవింపజేయడం, సాగునీటి లభ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆమె సియం కు వివరించారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువతో పాటు ఇతర ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సాగునీటి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో వచ్చే మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టుల అమలుకు రూ.35,313 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులకు రూ.3,883 కోట్ల వ్యయం అంచనా వేయగా, వీటి ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందని అధికారులు వివరించారు. జలధార కార్యక్రమం కింద 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ చానళ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. జలధార పనులను వీబీజీ రామ్‌జీ సంస్థ ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, జలధార కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసేందుకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున అదనపు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ, ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శంకర్ రెడ్డి, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎల్ సి రైల్వే గేట్ బ్రిడ్జిని సందర్శించిన ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు






**రైల్వే కోడూరు జూలై 13 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గం మండల కేంద్రం పుల్లంపేట ఎల్ సి రైల్వే గేట్ 98 బ్రిడ్జిని కడప ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు బ్రిడ్జిని సోమవారం సందర్శించడం జరిగినది ఆయనతోపాటు వైఎస్ఆర్సిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్ మరియు గుంతకల్లు రైల్వే డి ఆర్ యు సి సి సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి సందర్శించడం జరిగినది ఈ బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానిక ప్రజలు ప్రమాదాల నివారణకు పలుమార్లు అధికారులకు విన్నవించుకోవడం జరిగినది ఈ నేపథ్యంలో కడప ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు రాయలసీమ వైఎస్ఆర్సిపి బూత్ కన్వీనర్ భరత్ కుమార్ రెడ్డి ఈ బ్రిడ్జిని సందర్శించి ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించడం జరిగినది రైల్వే గేట్ వద్ద పలమార్లు ప్రమాదాలు సంభవించినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే ప్రమాదాలకు గల కారణాలను వెతికి నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరడం జరిగినది , ప్రమాదాలను నివారించడానికి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరతగతిన సమస్యకు పరిష్కారం పొందే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట వైసిపి కన్వీనర్ ముస్తాక్, పుల్లంపేట వైసీపీ బూత్ కమిటీ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ గడువు పెంచాలని బీఎస్పీ వినతి

## ఆర్టికల్326 స్ఫూర్తిని కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**అనంతపురం/గుత్తి, జూలై 13: (రిపబ్లిక్ న్యూస్)**
జాతీయ సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు మరింత గడువు ఇవ్వాలని కోరుతూ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు సోమవారం గుత్తి మండల తహసీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. స్వల్ప వ్యవధిలో ప్రక్రియను పూర్తి చేయాలనే నిబంధనలతో అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనివల్ల రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్326 ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాంటి రాజ్యాంగబద్ధమైన హక్కుకు భంగం కలిగించేలా ఎస్ఐఆర్ ప్రక్రియను తొందరపాటుగా నిర్వహించడం సరికాదని అన్నారు.
గతంలో ఓటర్ల సర్వేను ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ద్వారా నిర్వహించేవారని, ప్రస్తుతం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సర్వే చేపట్టడం వల్ల పక్షపాతానికి తావిచ్చే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల కొందరికి అనుకూలంగా ఓటరు జాబితా రూపొందే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో కొనసాగేలా ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని, ఎస్ఐఆర్ కార్యక్రమానికి తగిన గడువు ఇవ్వడంతో పాటు ప్రజలకు అవసరమైన అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.



ఎస్సీ, ఎస్టీ పరిశ్రమల సబ్సిడీ నిధులు వెంటనే విడుదల చేయాలి
ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పెండింగ్‌లో ఉన్న పరిశ్రమల సబ్సిడీ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ రాయలసీమ ఇన్‌చార్జ్ గద్దల నాగభూషణం డిమాండ్ చేశారు.
విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ యువత స్వయం ఉపాధి కోసం పరిశ్రమలు స్థాపించినప్పటికీ, ప్రభుత్వం అందించాల్సిన సబ్సిడీ నిధులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సబ్సిడీలు విడుదల కాకపోవడంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, ఆచరణలో మాత్రం వారికి అందాల్సిన ప్రోత్సాహకాలు నిలిపివేయడం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ బకాయిలను తక్షణమే విడుదల చేసి పరిశ్రమలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



**దళితులపై దాడులు అరికట్టాలి**
రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, వేధింపులను వెంటనే అరికట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకుడు బండల రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ.. దళితులపై దాడులు, సామాజిక వివక్ష, భూ ఆక్రమణలు, అన్యాయాలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందని ఆరోపించారు. దళితులపై దాడులకు పాల్పడుతున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు వెంటనే న్యాయం చేయడంతో పాటు భద్రత కల్పించాలని, దాడులకు పాల్పడిన వారిని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.దళితుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని రామాంజనేయులు కోరారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ గడువును మరో మూడు నెలలు పొడిగించాలి: సీపీఐ వినతి

**బనగానపల్లె, జూలై 13 రిపబ్లిక్ న్యూస్**
భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు బనగానపల్లె మండల సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని వారు కోరారు.
ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు కాకపోవడం, బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు) నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలు, రాజకీయ జోక్యం వంటి కారణాలతో వేలాది మంది ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
ఈ నెల 14వ తేదీతో రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగుస్తుందని ఎన్నికల సంఘం ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ అనేక మంది ఓటర్ల వివరాలు నమోదు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ప్రతి భారతీయ పౌరుడికి సార్వత్రిక ఓటు హక్కు కల్పించిందని, ఆ హక్కును పరిరక్షించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు.
మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు, నకిలీ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని ఎన్నికల సంఘం చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారు



ఆరోపించారు. ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన అనేక మంది ఓటర్లకు వారి దరఖాస్తుల స్థితిపై స్పష్టమైన సమాచారం అందడం లేదని, కొందరి పేర్లు ఓటర్ల జాబితాలో కనిపించడం లేదని తెలిపారు.అదేవిధంగా, పాత ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్నప్పటికీ, ఎన్యూమరేషన్ ఫారాలు అందకపోవడంతో చాలామంది అర్హులైన ఓటర్లు కొత్త జాబితాలో చోటు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటివరకు 50 శాతం కూడా ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాలేదని పేర్కొన్నారు.ప్రజల్లో అవగాహన లోపం, సాంకేతిక సమస్యలు, బీఎల్ఓల నిర్లక్ష్యం, ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందించకపోవడం వంటి కారణాలతో అర్హులైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే, ఈ ప్రక్రియను విపక్షాల ఓట్ల తొలగింపునకు దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి అర్హుడైన పౌరుడు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించేందుకు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును మరో మూడు నెలలు పొడిగించి, అవసరమైన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ద్వారా ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శివయ్య, జిల్లా సమితి సభ్యుడు సంజీవులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, సీపీఐ పలుకూరు గ్రామ శాఖ కార్యదర్శి బాలయ్య, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి స్వరూప, ఏఐఎస్ఎఫ్ బనగానపల్లె మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, సీపీఐ నాయకులు వేణు, హరి, పవన్ కళ్యాణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్మిషన్ లేకుండా ఖనిజ సంపద అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

## -సీఐ డి. శ్రీనివాసులు.

**రైల్వే కోడూరు జూలై 13 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు సర్కిల్ పరిధిలోని పుల్లంపేట, చిట్వేలు, ఓబులవారిపల్లి, పెనగలూరు మండలాలకు చెందిన ట్రాక్టర్, జేసీబీ యజమానులు మరియు డ్రైవర్లతో సోమవారం అవగాహన సమావేశాన్ని
సీఐ శ్రీ డి. శ్రీనివాసులు నిర్వహించారు, సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక, గ్రావెల్, మట్టి ని తవ్వడం, తరలించడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక, గ్రావెల్ లేదా మట్టిని తరలిస్తూ పట్టుబడిన వారి మీద చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేసి సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఎవరైనా చెరువులు, కుంటలు లేదా ఇతర ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తీసుకెళ్లాలనుకుంటే తప్పనిసరిగా సంబంధిత ఇరిగేషన్ శాఖ లేదా సంబంధిత ప్రభుత్వ శాఖల నుండి ముందస్తు



అనుమతి పొందాలని సూచించారు. అలాగే ఇసుక, గ్రావెల్ లేదా మట్టి రవాణా చేపట్టే వారు మైన్స్ అండ్ జియాలజీ శాఖ లేదా సంబంధిత శాఖల ద్వారా జారీ చేసిన చెల్లుబాటు అయ్యే అనుమతులు, రవాణా పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.
అనుమతులు లేకుండా వాహనాలను వినియోగించడం వల్ల యజమానులు, డ్రైవర్లు అనవసరంగా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలను అక్రమ రవాణాకు అద్దెకు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని, డ్రైవర్లు కూడా సంబంధిత



పత్రాలు పరిశీలించిన తర్వాత మాత్రమే రవాణా చేపట్టాలని సూచించారు.ప్రజల సహకారంతో అక్రమ మైనింగ్ మరియు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. సర్కిల్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిరంతరం నిర్వహించబడతాయని, రాత్రి మరియు పగలు వేళల్లో కూడా వాహనాల తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు. అక్రమ కనిజ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కోడూరు రూరల్ సర్కిల్ పోలీసులకు తెలియజేసి ప్రజలు సహకరించాలని కోరారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు శుభవార్త

## ఇమ్మిగ్రేషన్ పరిధిలోకి ఎయిర్‌పోర్టు

**న్యూఢిల్లీ,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్–2025' పరిధిలోకి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుని తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అధికారిక గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భోగాపురం నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాల రాకపోకలకు చట్టపరమైన మార్గం సుగమమైంది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల ప్రకారం కేటగిరీ–1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ గుర్తింపుతో విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్, విదేశీయుల ప్రవేశ, నిష్క్రమణకు సంబంధించిన అన్ని పక్రియలను అధికారికంగా నిర్వహించే అవకాశం కలిగింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత విదేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలకు అంతర్జాతీయ ప్రయాణాలు మరింత సులభం కానున్నాయి. అలాగే పర్యాటకం, ఐటీ, పారిశ్రామిక రంగాలతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం లోనూ ఈ నిర్ణయం కీలక పాత్ర పోషించనుందని అధికారులు భావిస్తున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ప్రధాన కేంద్రంగా మారనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ఆ ప్రాంత అభివృద్ధికి మరో మైలురాయిగా నిలవనుంది. విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ కనెక్టివిటీ పెరగడంతో పాటు వాణిజ్య, ఉపాధి అవకాశాలూ గణనీయంగా విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, తాజా ఉత్తర్వులు హోంశాఖ అదనపు కార్యదర్శి నితేశ్ కుమార్ వ్యాస్ పేరిట జారీ అయ్యాయి.

\-------------

# ఏజెన్సీ ప్రాంతంలో భారీగా గంజాయి పట్టివేత

## కుజపంగి జంక్షన్ వద్ద 1,373 కిలోల గంజాయిని స్వాధీనం

**అల్లూరి సీతారామరాజు,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–** అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పోలీసులు భారీ గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ముంచంగిపుట్టు మండలం కుజపంగి జంక్షన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 1,373 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ ప్రాంతం నుంచి పెదబయలు మండలం జామిగుడా ? రోడకోట మార్గం ద్వారా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో కుజపంగి జంక్షన్ వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టిన పోలీసులు బొలెరో వాహనాన్ని అడ్డుకున్నారు. తనిఖీల సమయంలో వాహనంలో 43 బస్తాల్లో తరలిస్తున్న 1,373 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో ఈ గంజాయి విలువ కోట్ల రూపాయలు ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన దయానిధి ఖురాను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. యితే ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్‌కు సంబంధం ఉన్న మరికొందరు నిందితులు ఘటనాస్థలం నుంచి పరారయ్యారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ గంజాయిని ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ రవాణా వెనుక ఉన్న ముఠా వివరాలు ఏమిటనే అంశాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు
చేస్తున్నారు. అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఏపీలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు కఠిన చర్యలు చేపట్టామని పోలీసులు హెచ్చరించారు.

\-----

# సాయికృష్ణ కేసు సుప్రీంకు అప్పగింత

## హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన సిబిఐ

**అమరావతి,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం పై సీబీఐ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ కేసు అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపేది కాదని సీబీఐ తన వాదనలో పేర్కొంది. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తును చేయిస్తోందని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సీబీఐ విచారణ అవసరమని చెప్పడానికి తగిన అసాధారణ పరిస్థితులు లేవని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను సీబీఐ అధికారులు ప్రస్తావించారు. అత్యంత అసాధారణమైన పరిస్థితుల్లో మాత్రమే ఆయా కేసులను సీబీఐకి బదిలీ చేయాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని గుర్తుచేశారు. సాధారణంగా ప్రతి కేసును సీబీఐకి అప్పగించడం వల్ల ఆ సంస్థపై కేసుల భారం పెరిగి, పరిమిత వనరులతో కీలకమైన, సంక్లిష్టమైన కేసుల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని తన కౌంటర్‌లో సీబీఐ అధికారులు ప్రస్తావించారు. అలాగే, ఒకవేళ ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాల్సిన అవసరం ఉందని కోర్టు భావిస్తే, దర్యాప్తు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, ఇతర సహాయ సహకారాలను అందించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీబీఐ అధికారులు కోరారు. ఈ కేసులో దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించాలా లేదా అనే అంశంపై హైకోర్టు తదుపరి విచారణలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సాయికృష్ణ అదృశ్యం వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఈ కేసుపై న్యాయపరమైన పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

# గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు !

**జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్దరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే..చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్దరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్దరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళు ్లగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు.



చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్దరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతటట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ది చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు.చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి. ఈ నెలలోనూ వర్షాలు కురువకపోవచ్చనే అంచనాలను వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ ముందుగానే పంటలు వేస్తే తర్వాత వర్షాలు కురువకపోతే పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదంతా కూడా గ్రామాల్లో వాననీటిని ఒడిసి పట్టకపోవడం వల్ల జరిగిన నష్టంగా గుర్తించాలి. ఇప్పటికైనా గ్రామాల్లో తాగు, సాగునీటి ప్రాజెక్టును పునరుద్దరించడం ద్వారా అభివృద్ధికి అడుగులు వేయాలి.

## ప్రతీకార దాడులకు ఇరాన్ ఎత్తుగడ

### ట్రంప్, నెతన్యాహులను మట్టుబెట్టే ప్లాన్

### తాజాగా స్థానిక మీడియాలో రివెంజ్ లిస్ట్

**టెహ్రాన్,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
ఇరాన్‌పై అమెరికా తాజా దాడులతో మరోమారు పశ్చిమాసిలో శాంతి కరువయ్యింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివెంజ్ లిస్ట్‌ను ప్రచురించడం గమనార్హం. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి.ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అగ్రరాజ్యం చేస్తోన్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేం దుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

## భారత్‌లో పెరుగుతున్న విదేశీ విద్యార్థులు

### మనదేశంలో నేపాల్ విద్యార్థులే అత్యధికం



**న్యూఢిల్లీ,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–** ఇండియాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో నేపాల్ దేశానికి చెందిన వారే అత్యధికంగా ఉన్నారని కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది. 2023–24 అకాడమిక్ ఇయర్‌లో ఎక్కువ మంది విదేశీ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చిన రాష్ట్రంగా కర్ణాటక ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ సర్వే పేర్కొంది. కేంద్ర విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం2023–24 అకాడమిక్ ఇయర్‌లో దేశంలోని వివిధ కళాశాలలు 173 దేశాలకు చెందిన విద్యార్థులకు చోటు కల్పించాయి. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, కళాశాలల్లో 58,134 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారు. భారతదేశానికి చదువుకోవడానికి వచ్చే విదేశీ విద్యార్థులలో నేపాల్‌కు చెందిన వారు 24.1 శాతం మంది ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ నుంచి 7 శాతం.. అమెరికా నుంచి 5.9 శాతం.. బంగ్లాదేశ్ నుంచి 5.9 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. అత్యధిక విదేశీ విద్యార్థులు చదువుకోవడానికి ఎంచుకున్న రాష్ట్రంగా కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది. 2023–24 అకాడమిక్ ఇయర్‌లో 7,914 మంది విదేశీ విద్యార్థులు కర్ణాటకలో చదువుకున్నారు. రెండో స్థానంలో పంజాబ్.. మూడో స్థానంలో మహారాష్ట్ర నిలిచాయి. అంతర్జాతీయ విద్యార్థులలో 73.6 శాతం మంది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరారు.

## ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనలు

### ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా -తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్

**టెహ్రాన్,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
పశ్చిమాసియాలో యుద్ధం ఆగినట్టే కనిపించినా.. ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యంపోసింది. అమెరికా జరిపిన తాజా సైనిక దాడులపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, వాషింగ్టన్ చర్యలు ప్రాంతీయ స్థిరత్వాన్ని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని దెబ్బతీస్తు న్నాయని ఆరోపించింది. ఇది ముమ్మాటికీ ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమేనని ఆరోపించింది. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, అమెరికాకు సహకరించే దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా తమపై దాడులు చేయడానికి ఏ దేశమైనా తన భూభాగాన్ని లేదా సదుపాయాలను ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే, ఆ దేశాలను కూడా తాము శత్రువులుగానే పరిగణిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఇరాన్‌పై సైనిక దాడులు చేయడానికి ఏ దేశ



భూభాగం లేదా సదుపాయాలు ఉపయోగించినా, దానిని దురాక్రమణకు మూలంగా పరిగణిస్తాం. ఇరాన్ సాయుధ దళాల రక్షణాత్మక చర్యల్లో భాగంగా వాటిని చట్టబద్ధమైన లక్ష్యాలుగా చూస్తాం'. అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇటీవల మస్కట్‌లో జరిగిన చర్చల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ పూర్తిగా తోసిపుచ్చింది. వాటిని 'పచ్చి అబద్ధం' గా తేల్చింది. మస్కట్ చర్చలు కేవలం హోర్ముజ్ జలసంధి నిర్వహణ, అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపైనే జరిగాయని, అమెరికా అధ్యక్షుడు చిత్రీకరిస్తున్నట్లుగా కాదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా జరిపిన సైనిక చర్యలపై ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ స్పందించిన తీరు సరిగ్గా లేదని ఇరాన్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలను, ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికాను జవాబుదారీగా చేయాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, భద్రతా మండలిని ఇరాన్ కోరింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలు, పౌరులపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం ఇరాన్‌పై సరికొత్త సైనిక దాడులను ప్రారంభించింది. అంతకుముందు శనివారం కూడా అమెరికా దళాలు ల్యాండ్, సీ–బేస్డ్ ÷టైర్ ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, నౌకాదళ నౌకల ద్వారా దాదాపు 140 ఇరాన్ సైనిక లక్ష్యాలపై కచ్చితమైన దాడులు చేశాయి. ఇందులో ఇరాన్ క్షిపణి, డ్రోన్ సైట్లు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాలు, తీర నిఘా ప్రాంతాలు ఉన్నాయి. అమెరికా దాడుల అనంతరం దక్షిణ ఇరాన్ నగరాలైన జాస్క్, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో మూడు భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రెస్ టీవీ ధృవీకరించింది. మరోవైపు, ఇరాన్–అమెరికా మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు.

## ఆహార కల్తీపై మహారాష్ట్రలో ఉక్కుపాదం

### ఎఫ్‌డీఏ తనిఖీల భయంతో వణికిన పాలవ్యాపారులు -వందల లీటర్ల పాలు మురుగు కాలువల్లో పారబోసిన వైనం

**ముంబై,జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
మహారాష్ట్రలోని సతారా జిల్లా మాన్ తాలూకాలో ఎఫ్‌డీఏ అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారనే ప్రచారం కలకలం రేపింది. దీంతో భయాందోళనకు గురైన కొందరు పాల డెయిరీ నిర్వాహకులు వందల లీటర్ల పాలను రోడ్లపై, మురుగు కాలువల్లో పారబోశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇటీవల మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తుకారాం ముండే.. ఆహార కల్తీ, నాణ్యత లోపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. మాన్ తాలూకాలోని గ్రామాల్లో యథావిధిగా పాల సేకరణ కొనసాగుతోంది. అయితే, మధ్యాహ్నం సమయంలో ఎఫ్‌డీఏ అధికారులు పాల డెయిరీలు, పాల సేకరణ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారనే ప్రచారం వేగంగా వ్యాపించింది. పాల నమూనాలను పరీక్షించి లోపాలు తేలితే కఠిన చర్యలు తీసుకుంటారనే భయంతో కొందరు పాల డెయిరీ నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. నేపథ్యంలోనే పాల సేకరణ వాహనంలో ఉన్న వందల లీటర్ల పాలను రోడ్డు పక్కన, సమీపం లోని మురుగు కాలువలో పారబోశారు. ఈ ఘటనకు





సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రోడ్లపై పాల ప్రవాహం కనిపించిన దృశ్యాలు చూసి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ఘటనతో పాల నాణ్యతపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాలను ఎందుకు పారబోశారు. పాలలో ఏవైనా నాణ్యత సమస్యలు ఉన్నాయా. పాల సేకరణ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను వెల్లడించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. మహారాష్ట్రలో ఆహార కల్తీపై ఎఫ్‌డీఏ నిఘా మరింత కఠినతరం చేసిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం పాల భద్రత, నాణ్యతపై ప్రజల్లో ఆందోళనలను మరింత పెంచింది.

## రాయికల్లో రావుల రాజేషశీ మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ పట్టణం జూలై 13( రిపబ్లిక్ న్యూస్)**





జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన నాయకులు ముత్యంరాజు బావ రావుల రాజేశం ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజిశీగి నందయ్య రాయికల్ పట్టణ మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు

""ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సత్కరించిన శ్రీరాంనగర్ కాంగ్రెస్ నాయకులు ""

ఇదిలా ఉండగా రాయికల్ మండల శ్రీరామ్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ కరీం జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ,పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.వెంట సర్పంచ్ శ్రీరామ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.ది

## రాయికల్ వడ్డలింగాపూర్, చింతలూర్,తటల్ వాయు లో గీతా కార్మికులకు సబ్సిడీతో 160 కాటమయ్య కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ పట్టణం జూలై,13( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ మండల వడ్డే లింగాపూర్ గ్రామంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో వడ్డే లింగాపూర్,చింతలూరు గ్రామాల గీతా కార్మికులకు ,తాట్లవాయి గ్రామాలకు చెందిన కల్లుగీత కార్మికులకు 100శాతం సబ్సిడీతో 160 కాటమయ్య రక్షణ కిట్ల ను పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ గీతా కార్మికులకు ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నాడని ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ లు మానస సాయి కుమార్ గౌడ్,ఆకుల మల్లేశం,బనావత్ రమేష్,జ్యోతి సంతోష్,ఉప సర్పంచ్ లు,బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, ఎంపిడిఓ చిరంజీవి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రావు,

పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి ,మాజీ ఎంపీపీ సంధ్యారాణి,కోల శ్రీనివాస్ , డీసీసీ జిల్లా కార్యదర్శి యం ఏ ముఖీధ్, జిల్లా పార్టీ ఎస్టీ సెల్ సురేందర్ నాయక్ , ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్,సర్పంచ్ లు ప్రసాద్,మహేందర్,గౌడ సంఘం అధ్యక్షులు మహేష్ గౌడ్,సర్పంచులు, నాయకులు, ఎక్సైజ్ అధికారులు మండల గ్రామ నాయకులు గౌడ సంఘంసభ్యులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కామగల్ల నరేష్ నియామకం

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కామగల్ల నరేష్‌ను నియమించారు. టీ వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తనుగుల జితేందర్ రావు గారు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు సంస్థ నాయకులు తెలిపారు.సంస్థ బలోపేతం, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, యువ జర్నలిస్టుల అభివృద్ధి కోసం కృషి చేయగల నాయకత్వ లక్షణాలను గుర్తించి కామగల్ల నరేష్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.ఈ నియామక కార్యక్రమం టీ వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు కామగల్ల నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులుతనుగుల జితేందర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ది

## నేటి యువత గంజాయి, ఇతర మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలి

### -జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి

**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



సోమవారం జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు . జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సిద్దార్ధ జూనియర్ కళాశాల, మెదక్ పట్టణం లో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా అవగాము సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపర్ ఇండియన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తును నాశనం చేస్తుంది, విద్యార్థులు మాదకద్రవ్యాలకు . దూరంగా ఉండి తమ భవిష్యతను క్రమశిక్షణగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎక్సైజ్ అధికారులు సి ఐ నాగేశ్వరరావు, డి టీ ఎఫ్ సీ ఐ జె గోపాల్, మెదక్ ఎస్ ఐ బి మాన్సింగ్ సింగ్, మరియు సిబ్బంది. సందీప్, మదుసూదన్ రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

## వడ్డెర కాలనీ "శివాజీ నగర్"లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు ప్రారంభించి పంపిణీ చేసిన సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్

**రాయికల్ పట్టణం జూలై,13 ( రిపబ్లిక్ న్యూస్)**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఒడ్డెర కాలనీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ ప్రారంభించారు. పిల్లల్లో నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం నివారించేందుకు ప్రతి 6 నెలలకు ఒకసారి ఈ మాత్రలు వేయించడం జరుగుతుందని తెలిపారుఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోదాసు రాజేష్, కార్యదర్శి మమ్మద్ అమీర్, ఉపాధ్యాయులు మోహన్, నవ్యశ్రీ, అంగన్వాడీ టీచర్ బియ్యని సుజాత,ఆశ వర్కర్ సుమలత, కారోబార్ జలంధర్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారతదేశంలో ఓటు హక్కు ప్రజాస్వామ్యం లో ఒక ఆయుధం

### -రాయికల్ పట్టణంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ పట్టణం జూలై13( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల్ జిల్లా రాయికల్ పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ పై పట్టణ కో ఆర్డినేటర్ లు,బి ఎల్ ఏ లతో సమీక్ష సమావేశం నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య వార్డులో గ్రామాల్లో ప్రతి ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై అవగాహన చేపట్టాలని, బి ఎల్ ఓ లు పంపిణీ చేసిన ఓటర్ ఏ మీన్యూమరేషన్ గణన పత్రాలలో సరైన సమాచారం పూరించే విదంగా వార్డు గ్రామ ప్రజలతో కలిసి నాయకులు చొరవ తీసుకోవాలి.

వార్డులో గ్రామాల్లో ఇంటింటి కి గణన పత్రాలు పంపిణీ చేసిన కుటుంబాలు,ఇంకా గణన ఫారం అందుకొని కుటుంబాల సంఖ్య తెలుసుకోవాలి.

పెండింగ్‌లో ఉన్న కుటుంబాల వివరాలు తీసుకోవాలి వారివివరాలు నమోదు కు చొరవ తీసుకోవాలి .

అర్హులైన ప్రతి కుటుంబం సర్వేలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పార్టీ బి ఎల్ ఏ ఫీల్డ్ సిబ్బంది పనితీరు సమీక్ష చేయాలి.ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు,ప్రజల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం






పార్టీ దృష్టికి తీసుకురావాలి. నిర్దేశిత గడువులో సర్వే పూర్తి చేయడానికి బి ఎల్ ఏ లు కార్యాచరణ చేపట్టాలి అని అన్నారు.2002 లో రాయికల్ గత నియోజకవర్గం బుగ్గారం కావున ఆలోచించి నింపాలి. ప్రజలకు అవగాహన కల్పించాలని..2002 ఓటు ఉన్న వారు లేని వారు విషయం లో ఫారం నింపే విషయం లో అవగాహన కల్పించడం ...ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఇదే చివరి రోజు అనుకొనే గణన ఫారం బి ఎల్ ఓ కు అందజేయాలి..నిర్లక్షంచేయవద్దు..ఓటు అనేది ప్రజాస్వామ్యం లో ఒక ఆయుధం అని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు ఈ కార్యక్రమంలో మండల మరియు పట్టణ అధ్యక్షులు రవీందర్ రావు వాసం రాజేందర్ ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి కోల శ్రీనివాస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు లావుద్య సురేందర్ నాయక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్ మాజీ ఎంపీపీ సంధ్యారాణి మాజీ ఎఎంసీ చైర్మెన్ రాజి రెడ్డి మాజీ కేడీసీసీ సభ్యులు పడిగలరావిందర్ రెడ్డి సర్పంచ్ బెజ్జంకి మోహన్, రాయికల్ మాజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు 8 వార్డ్ కౌన్సిలర్ పల్లి కొండ గంగాధర్ సర్పంచులు కౌన్సిలర్ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎమ్‌జీఈ పరీక్షలో ఉత్తీర్ణత చెంది వైద్య వృత్తికి అర్హత సాధించిన రాయికల్ బత్తిని అమూల్య గౌడ్

**రాయికల్ పట్టణం జూలై,13( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా, రాయికల్ పట్టణానికి చెందిన చెందిన బత్తిని జలపతి గౌడ్,భారతి ల కుమార్తె బత్తిని అమూల్య గౌడ్ అమెరికాలోని యూనివర్సిటీ లో వైద్య విద్యను పూర్తి చేసి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్నిర్వహించే ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామ్ ను తొలి ప్రయత్నంలోనే అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి, భారతదేశంలో వైద్య వృత్తిని నిర్వహించేందుకు అర్హత పొందారు.

తన మాతృదేశమైన భారతదేశంలోనే ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఎఫ్ఎమ్‌జీఈ పరీక్షకు హాజరై విజయాన్ని అందుకోవడం పై ప్రముఖ రచయిత వేముల ప్రభాకర్ గౌడ్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెరుకు మహేశ్వర శర్మ అమూల్య గౌడ్ కు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ వైద్యురాలిగా సేవలందించాలనే చిరకాల స్వప్నాన్ని బత్తిని అమూల్య సాకారం చేసుకోవడంతో పాటు, గౌడ సామాజిక వర్గానికి చెందిన తొలి మహిళా వైద్యురాలిగా నిలిచి స్ఫూర్తిదాయకమైన మైలురాయిని నెలకొల్పారని అన్నారు .

మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తనకు, ఈ



విజయాన్ని సాధించడం కుటుంబానికే కాకుండా తమ పట్టణానికి, సమాజానికి గర్వకారణమైన క్షణమని డా. అమూల్య గౌడ్ అన్నారు. తన తల్లిదండ్రులు జలపతిగౌడ్,భారతి చేసిన ఎన్నో త్యాగాలు, అచంచలమైన నమ్మకం, నిరంతర ప్రోత్సాహం, ప్రేమాభిమానాలు, ప్రతి కష్టంలో వెన్నంటే నిలిచిన అండదండలే తన విజయానికి మూల కారణమని తెలిపారు. తన సోదరి బత్తిని ఆకాంక్ష అందించిన మార్గదర్శకత్వం, మానసిక ధైర్యం, నిరంతర ప్రేరణ, నిస్వార్థ సహకారం తన విజయయాత్రలో కీలక పాత్ర పోషించాయని కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న మరియు వైద్య రంగంలో అడుగుపెట్టాలనే లక్ష్యంతో ఉన్న విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలియజేస్తూ, "భగవంతునిపై




విశ్వాసం, లక్ష్యంపై అంకితభావం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు.కలలను నమ్మండి, కష్టపడటాన్ని ఎప్పుడూ ఆపవద్దు. ఒకరోజు మీ కృషి మీ విజయంగా మారుతుంది. భవిష్యత్తులో దేశానికి సేవ చేసే గొప్ప వైద్యులుగా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని సందేశం అందించారు.

## జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ( చిట్టిబాబు) ఆధ్వర్యంలో జోగిపేట జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలోడి వార్మింగ్ డే కార్యక్రమం








**ఆందోల్ ప్రతినిధి జులై 13 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

ఆందోల్ మండలం జోగిపేట పట్టణంలో గల జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ ( చిట్టి బాబు ) ఆధ్వర్యంలో డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైస్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ నులి పురుగులు కడుపులో నట్టల పురుగుల నివారణకు చదువుకునే అమ్మాయిలకు ఎలాంటి ఆరోగ్య పరంగా సమస్యలు రాకుండా మనం ఆహారం తినేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడం మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనం శుభ్రత పాటించడం చేయాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది . అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం గౌరవనీయులు తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ గారి ఆదేశాల మేరకు బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 9వ తరగతి అమ్మాయిలకు ఆల్బండెజో ల్ టాబ్లెట్లు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు హేమలత మేడం డాక్టర్ శంకర్ నాయక్ గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బంది సిస్టర్ సుజాత మరియు ఆశ వర్కర్ శాంత బాలికల పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు జర్నలిస్టులకు ఘన సన్మానం

### జర్నలిస్టు ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో అభినందన సభ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులకు రామచంద్రపురంలోని బాలాజీ గార్డెన్స్ లో శనివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టు ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ బాసిత్ హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. సంఘం బలోపేతానికి అంకితభావంతో పనిచేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు.



ఈ సందర్భంగా జిల్లా జనరల్ సెక్రటరీ అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జనరల్ సెక్రటరీ భక్వేశ్వర్, జిల్లా సంయుక్త కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఈసీ సభ్యుడు మజీద్ అలీలను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వంతో పాటు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు. ప్రతి జర్నలిస్టుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సభ్యుల సహకారంతో సంగారెడ్డి జిల్లా కమిటీని రాష్ట్రంలోనే ఆదర్శ కమిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని పేర్కొన్నారు.

సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ప్రభాకర్ యాదవ్‌కు, ముఖ్య అతిథిగా హాజరైన అబ్దుల్ బాసిత్‌కు, కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులు, సంఘ సభ్యులందరికీ సన్మానితులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల మౌలిక వసతులను మెరుగుపరచాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి




**నంద్యాల, జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలను పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తక్షణమే పెంచాలని, వసతి గృహాల మౌలిక వసతులను మెరుగుపరచాలని సోమవారం యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, నంద్యాల జిల్లా కమిటీ సమస్యలను జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. యూ.ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల, గిరిజన, సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల మెస్ బిల్లులను పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే నెలకు రూ. 3,000లకు పెంచాలని మా విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచుతామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. కానీ నేడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, మెస్ చార్జీల పెంపుపై ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేయడం అత్యంత శోచనీయం. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, గ్యాస్, పాలు వంటి అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పాత చార్జీల ప్రకారమే నిధులు విడుదల చేస్తుండటంతో, వసతి గృహాల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించలేకపోతున్నారు. దీనివల్ల వసతి గృహాల్లోని వేలాది మంది పేద విద్యార్థులు తీవ్రమైన పోషకాహార లోపానికి గురవుతున్నారు, తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. పెరిగిన ధరల దృష్ట్యా అన్ని రకాల సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను తక్షణమే నెలకు రూ. 3,000లకు పెంచాలి. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల మధ్య నడుస్తున్న వసతి గృహాలకు తక్షణమే ప్రభుత్వ నూతన భవనాలను నిర్మించాలి.
హాస్టళ్లలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా వంటి కనీస మౌలిక వసతులను మెరుగుపరచాలి.
విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్ చార్జీలను కూడా ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశార. కావున, నంద్యాల జిల్లా కలెక్టర్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యలను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అలాగే జిల్లా స్థాయిలో ఉన్న హాస్టళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయసింహా రెడ్డి జిల్లా కార్యదర్శి దేవానంద్ విద్యార్థి నాయకులు సురేష్, శివ, నరేష్,కళ్యాణ్, పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి

**అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలి**

**వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయండి**

**పీజీఆర్ఎస్‌లో 334, రెవెన్యూ క్లినిక్స్‌లో 193 అర్జీల స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**








**నంద్యాల బ్యూరో, జూలై 13( రిపబ్లిక్ న్యూస్):**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని తెలిపారు. అర్జీల పరిష్కారంపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా సమీక్షిస్తోందని పేర్కొన్నారు. అధికారులు కేవలం నివేదికలు సమర్పించడమే కాకుండా, అర్జీదారులను వ్యక్తిగతంగా కలిసి సమస్యను వివరించి పరిష్కరించే విధంగా వ్యవహరించాలని సూచించారు. దీనివల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. నంద్యాల రూరల్ తహశీల్దార్ పరిధిలో ఇనాం భూమిని పట్టా భూమిగా మార్చి అర్జీదారుడి సమస్యను పరిష్కరించడం ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. మరోవైపు జూపాడుబంగ్లా మండలంలో ఒక అర్జీకి సంబంధించి తప్పు సమాచారం అందించిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ స్వయంగా అర్జీదారుని కలిసి వివరణ ఇవ్వడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. అర్జీదారులకు అందించే పరిష్కార నివేదికలపై సంబంధిత అధికారులు తప్పనిసరిగా సంతకం చేయాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించాలి. ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి వద్ద నుంచే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం సుమారు 1,500 ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులకు వచ్చే ప్రతి పౌరునికి ఈ సేవలపై అవగాహన కల్పించి, కార్యాలయాలకు రాకుండానే ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

### రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 193 అర్జీల స్వీకరణ

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్స్‌లో మొత్తం 193 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22–ఎ భూములకు సంబంధించినవి 4, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 39, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 73, సర్వే, రీ–సర్వే అంశాలకు సంబంధించినవి 61, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 13 అర్జీలు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

### పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ముఖ్యమైన అర్జీలు

1)జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన రాజా గౌడు, సర్వే నంబరు 542/బిలో ఉన్న 2.52 ఎకరాల భూమి చుక్కల భూమిగా నమోదైందని, దానిని పట్టా భూమిగా మార్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

2)ఆళ్లగడ్డ మండలం బాచాపురం గ్రామానికి చెందిన అన్నెం కాశీ విశ్వనాథరెడ్డి, జి. జంబులదిన్నె గ్రామంలోని సర్వే నంబరు 300/2లో తనకు ఉన్న 3.60 ఎకరాల భూమికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

3)కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఎం. దిబ్బన్న, సర్వే నంబరు 1172లోని తన భూమిని ఇతరులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

**జూలై 16న తుంగభద్ర నుంచి 1.5 టీఎంసీల నీటి విడుదల**

# తాగునీటికే తొలి ప్రాధాన్యత

**నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**పంట నష్టాల నివారణకు రైతులు బీమా ప్రీమియంలు చెల్లించాలని పిలుపు**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 13)**
జూలై 16న తుంగభద్ర ప్రాజెక్టు నుంచి 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. ఈ నీరు 123 కిలోమీటర్ల దూరం ప్రయాణించి జిల్లాకు చేరేందుకు సుమారు ఐదు రోజులు పడుతుందని వెల్లడించారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు.
తుంగభద్ర నుంచి విడుదలయ్యే నీటితో ముందుగా ఎస్ఎస్ ట్యాంకులను నింపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరా చేయడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ట్యాంకుల నుంచి అనధికారికంగా నీటిని తీసుకునే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని హెచ్చరించారు.ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తీవ్రంగా తగ్గిపోవడంతో సాగునీటి సరఫరాకు అనుకూల పరిస్థితులు లేవని పేర్కొన్నారు. జూలై 16 తర్వాత నీటి విడుదల ప్రారంభం కానున్న నేపథ్యంలో తహసీల్దార్లు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి నీటి చౌర్యాన్ని అరికట్టాలని ఆదేశించారు.అనావృష్టి కారణంగా పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు పంట బీమాను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పత్తి, వేరుశనగ పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు జూలై 15 చివరి తేదీ అని గుర్తు చేశారు.రైతులు నష్టపోకుండా ఆర్థిక రక్షణ పొందేందుకు అధికారులు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆస్పరి, క్రిష్ణగిరి, ఆలూరు మండలాల్లో నాన్–లోనీ రైతులు అధికంగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రెవెన్యూ, వ్యవసాయ శాఖలు, వీఆర్‌వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, బ్యాంకర్లు కలిసి రైతులకు పంట బీమాపై పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పశుపోషకులకు కూడా బీమా వర్తించే అంశంపై పశుసంవర్ధక శాఖతో చర్చలు జరిపినట్లు తెలిపారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎల్‌డీఎం పి. మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# జల్ సంచాయ్ - జల్ భాగిధారీలో వేగం పెంచాలి

**జలధార - జలహారతి విజయంతో జిల్లాకు సీఎం ప్రశంసలు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**నంద్యాల బ్యూరో, జూలై 13 (రిపబ్లిక్ న్యూస్):** జల్ సంచాయ్ –జల్ భాగిధారీ కార్యక్రమంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు, జలధారజలహారతి కార్యక్రమంలో సాధించిన విజయాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. జలధార – జలహారతి పనులను సమయానికి పూర్తి చేసినందుకు జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించినట్లు ఆమె తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్జ–ల్ భాగిధారీ, జలధార –జలహారతి కార్యక్రమాల పురోగతిపై ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో భూగర్భ జలాల శాఖ అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణమూర్తి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కోఆర్డినేటర్ అంకిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్ – జల్ భాగిధారీ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను మరోసారి పరిశీలించి, నాణ్యమైన ఫోటోలను మాత్రమే అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 50 జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి బహుమతిగా రూ.2 కోట్లు, రెండో బహుమతిగా రూ.1 కోటి, మూడో బహుమతిగా రూ.50 లక్షలు, నాలుగో బహుమతిగా రూ.25 లక్షలు అందజేస్తారని పేర్కొన్నారు. జలధార – జలహారతి కార్యక్రమంలో జిల్లాకు మొత్తం 2,031 పనులు మంజూరు కాగా, వాటిలో 1,960 పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 71 పనులను ఆత్మకూరు, బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ మండలాల్లో అత్యంత వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా గతంతో పోలిస్తే భూగర్భ జలాల నిల్వ సామర్థ్యం ఎంత మేర పెరిగింది, నీటి రీచార్జ్ సామర్థ్యంలో ఎలాంటి మార్పు వచ్చింది అనే అంశాలను కూడా శాస్త్రీయంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వివరాలు భవిష్యత్ నీటి వనరుల ప్రణాళికకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా వీబీ రామ్‌జీ పనులకు సంబంధించి ఈ నెలకు రూ.8.40 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్య సాధన కోసం అధిక సంఖ్యలో ఉపాధి శ్రామికులు పనులకు హాజరయ్యేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.




# మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల నూతన ట్రాఫిక్ సీఐ.

**నంద్యాల జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–**
నంద్యాల నూతన ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.జే. సుబ్రహ్మణ్యం ఈరోజు నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ సీఐ సుబ్రహ్మణ్యం ని మంత్రి ఫరూక్ అభినందించారు. నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో మరియు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థను అమలు చేయడంలో సుబ్రహ్మణ్యం సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు.

# వర్షాభావం.. తీవ్ర దుర్భిక్షం

**వేసిన పంటలు ఎండుతున్నాయి**

**బండి ఆత్మకూరులో నారుమడి కాపాడేందుకు ట్యాంకర్ తో నీళ్లు**

**వర్షం కోసం రైతన్నల ఎదురుచూపులు**

**వర్షం కోసం పూజలు చేస్తున్న రైతన్నలు**



**బండి ఆత్మకూరు, జూలై 13, (రిపబ్లిక్ న్యూస్):–** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నంద్యాల జిల్లా వ్యాప్తంగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటి నుంచి నేటి వరకు సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీని ప్రభావంతో బోర్లలో నీరు అందడం లేదు. అలాగే వాగులు, వంకలు పంట కాలువలు నీళ్లు లేక వెల వెల బోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సాగు చేసిన పైర్లన్నీ ఎండిపోయి ఆందోళన కలిగిస్తున్నాయి. గత నెలలో కురిసిన అరా–కొర వర్షాలకు రైతులు సాగు చేశారు. అయితే వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాక అగచాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని భోజన గ్రామంలో సాగుచేసిన సుమారు 10 ఎకరాల సోయాబీన్ పైరును రైతులు సుమారు 20 రోజులకు పైనే వేసిన పంటను నీరు లేక దున్నేసే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. అలాగే మండల కేంద్రం బండి ఆత్మకూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా రైతులు నారుమడి పూర్తిగా ఎండిపోయింది. దీంతో బాధిత రైతు సోమవారం నీటి ట్యాంకర్ ద్వారా నార్మడికి నీరు పెట్టి నారు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే నారుమడి పూర్తిగా ఎండిపోవడంతో రైతులు ఎలాగైనా వర్షాలు పడకపోతాయా? పంటలు సాగు చేయకపోతామా అని నార్మడి కాపాడుకునేందుకు నీటి ట్యాంకర్ ద్వారా నీటిని పారిస్తున్నట్లు బాధిత రైతు తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పలు గ్రామాల్లో రైతులు వర్షం కోసం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిస్తున్నారు. అయినప్పటికీ వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు కళ్ళు కాయలు కాచేలా వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్ముకొస్తున్న కరువు మేఘాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులను చైతన్య పరచాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఎల్ నీనో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు చేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు వెళ్లేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతా జిల్లా రైతాంగం కోరుతుంది.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com